**ఆదర్శ రైతు.. దూరదృష్టి** 2





**ఘనంగా సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుక** 2



AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in

8-11-2025 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2


## క్రీడలతో మానసిక ఆరోగ్యం

**అక్షరటుడే, మెండోరా:** క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, సీఐ శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. మెండోరా పోలీసుల ఆధ్వర్యంలో పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా పోచంపాడు గ్రామంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నీని వారిరువురు ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ..టోర్నీలో అధిక సంఖ్యలో యువతీయువకులు పాల్గొనడం అభినందనీయమన్నారు. మత్తు పదార్థాలతో కలిగే దుష్ప్రభావాలను వివరించారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మెండోరా ఎస్సై సుహాసిని ఆధ్వర్యంటో ఈ పోటీలు విజయవంతంగా నిర్వహించడంపై అభినందనలు తెలిపారు. టోర్నమెంట్‌లో విజేతలైన జట్లకు బహుమతులను అందజేశారు.



## దేశరక్షణకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలి

**అక్షరటుడే, ఆర్మూర్:** దేశ రక్షణకు ప్రతిఒక్కరూ ముందుండాలని ఆర్ఎస్ఎస్ ఇందూర్ విభాగ్ కార్యనిర్వాక దిగంబర్ జీ అన్నారు. పట్టణంలో శనివారం ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పథ సంచలన్ నిర్వహించారు. పట్టణంలోని పెర్కిట్ భైరవ గుట్ట నుంచి ఒక బృందం, ఆర్మూర్ పోచమ్మ ఆలయ కమాన్ నుంచి మరో బృందంతో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పట్టణంలోని జంబి హనుమాన్ ఆలయ ప్రాంగణం వరకు పథ సంచలన్ నిర్వహించారు. దారి పొడవున మహిళలు, యువకులు పూలు చల్లుతూ వారికి స్వాగతం పలికారు. అనంతరం జంబి హనుమన్ ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్మూర్ నగర కార్యనిర్వాహక్ పోల్కం నారాయణ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



## గిరిజన బాలికల హాస్టల్‌లో అర్ధరాత్రి చోరీ

**అక్షరటుడే, కామారెడ్డి:** ప్రభుత్వ గిరిజన బాలికల వసతి గృహంలో శుక్రవారం అర్ధరాత్రి దుండుగు చొరబడి చోరీకి పాల్పడ్డాడు. దీంతో విద్యార్థులు భయాందోళనకు లోనయ్యారు. హాస్టల్‌లో ఉన్న డిగ్రీ విద్యార్థులకు చెందిన నాలుగు మొబైల్స్ చోరీకి గురయ్యాయి. రాత్రి ఒంటి గంట ప్రాంతంలో ఈ ఘటన జరగడంతో విద్యార్థులు భయపడ్డారు. ఈ మేరకు శనివారం ఉదయం కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులు, హాస్టల్ వార్డెన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విద్యార్థులు మాట్లాడుతూ.. చోరీ విషయంలో సిబ్బంది హస్తం ఉందని ఆరోపించారు. వాచ్‌మెన్‌కు ఫోన్‌చేస్తే హాస్టల్ లోనే ఉండి కూడా లేనట్లుగా మాట్లాడాడని విద్యార్థులు ఆరోపించారు. హాస్టల్‌లోకి వచ్చిన వ్యక్తి ఒక గదిలో రెండు ఫోన్లు తీసుకున్నప్పుడు తాము గమనించి అరిస్తే గదికి గొళ్లెంపెట్టి ఇతర గదిలో మరొక రెండు ఫోన్లు చోరీ చేసి పారిపోయాడన్నారు. హాస్టల్‌లో ఉన్న నిచ్చెన రాత్రి కనిపించలేదన్నారు. ఈ విషయం వాచ్‌మన్‌ను అడిగితే మేడమ్ తీసేయ్యమన్నారని చెప్పారని, వార్డెన్‌కు ఫోన్ చేసి అడుగుతామంటే తానే తీసేశానని చెప్పాడని తెలిపారు. దీపావళికి ముందు కూడా ఇద్దరు వ్యక్తులు వచ్చారని భయంతో ఈ విషయాన్ని తాము బయటకు చెప్పలేకపోయామన్నారు. మద్యం, కల్లు తాగి సిబ్బంది పని చేస్తారని ఆరోపించారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. హాస్టల్‌లో విద్యార్థులకు రక్షణ లేదని విద్యార్థి సంఘాలు ఆరోపించాయి. చోరీ ఘటన విషయంలో హాస్టల్‌లో విద్యార్థులతో మాట్లాడిన విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని పట్టుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై వార్డెన్‌ను వివరణ కోరగా హాస్టల్‌లో ఎలాంటి సమస్యలు లేవన్నారు. కొంతమంది విద్యార్థులు తనపై పనిగట్టుకుని ఆరోపణలు చేస్తున్నారని కన్నీటి పర్యంతమయ్యారు.



ఉమ్మడి జిల్లాల్లో అనేక రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. డ్రంకన్ డ్రైవ్ కారణంగా అధికంగా యాక్సిడెంట్లు అవుతున్నాయి. దీంతో పోలీసులు మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నారు.
– అక్షరటుడే, కామారెడ్డి

# తాగి నడిపితే జైలుకే..

- ఉమ్మడిజిల్లాలో జోరుగా డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు
- రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసుల ప్రత్యేక చర్యలు
- జరిమానాలతో పాటు జైలు శిక్ష విధిస్తున్న కోర్టులు

నిత్యం డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపడుతూ పోలీసులు మందుబాబుల ఆటకట్టిస్తున్నారు. తాగి బండ్లు నడుపుతూ దొరికిన వారికి కోర్టుల్లో ప్రవేశపెడుతున్నారు. డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో కోర్టులు జరిమానాతో పాటు జైలు శిక్ష విధిస్తున్నాయి. రోడ్డు ప్రమాదాలపై పోలీసులు ఓవైపు అవగాహన కల్పిస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పేర్కొంటున్నారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దని సైతం ఆయా కార్యక్రమాల్లో భాగంగా స్పష్టం చేస్తున్నారు. మరోవైపు నిత్యం డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్నారు. అయినా వాహనదారులు పెడచెవిన పెడుతున్నారు.

### ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మూడు నెలల వ్యవధిలో వందలాది మందిపై కేసులు నమోదయ్యాయి. భారీగా జరిమానాలు పడ్డాయి. ఉమ్మడి జిల్లాలో పోలీస్ బాసులు డ్రంకన్ డ్రైవ్ కట్టడి చేసేందుకు చర్యలు చేపట్టారు. ప్రధాన రహదారులు, మూలమలుపులు, జంక్షన్ల వద్ద బ్రీత్ అనలైజ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఫలితంగా అనేక మంది మందుబాబులు దొరికిపోతున్నారు. సీపీ సాయిచైతన్య సైతం మద్యం తాగి వాహనాలు నడిపితే కఠినచర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలిచ్చారు.

### భారీగా జరిమానాలు.. శిక్షలు

డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వారిపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. వారి వాహనాలు స్వాధీనం చేసుకొని ఠాణాలకు తరలిస్తున్నారు. అనంతరం వారిని కోర్టులో హాజరు పరుస్తున్నారు. డ్రంకన్ డ్రైవ్ టెస్ట్‌లో మద్యం మోతాదును బట్టి కోర్టులు శిక్షలు విధిస్తున్నాయి. పలువురికి జరిమానాలు వేస్తుండగా.. మరికొందరికి జైలు శిక్ష సైతం వేస్తున్నాయి. ముఖ్యంగా ఒకటి కంటే ఎక్కువ సార్లు దొరికిన వారికి జైలు శిక్ష విధిస్తూ జడ్జీలు తీర్పు చెబుతున్నారు. దీంతో ఇటీవల కొంతమంది మందుబాబుల్లో మార్పు వచ్చింది. ఫలితంగా ప్రమాదాలు సైతం తగ్గినట్లు పోలీసులు పేర్కొంటున్నారు.

### మూడు నెలల వ్యవధిలో..

కామారెడ్డి జిల్లాలో మూడు నెలల వ్యవధిలో వందలాది డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. ఆగస్టులో 103 మందికి రూ.1,01,400 జరిమానాలు విధించగా ఇందులో 12 మందికి 2 రోజులు, 17 మందికి ఒక రోజు జైలు వేశారు. సెప్టెంబర్‌లో 391 మందికి రూ.3,52,000 జరిమానా, ఆరుగురికి 2 రోజులు, 25 మందికి ఒకరోజు జైలు శిక్ష విధించారు. అక్టోబర్లో 246 మందికి రూ.2,47,000 జరిమానా వేశారు. ఆరుగురికి రెండు రోజులు, 32 మందికి ఒకరోజు చొప్పున జైలు విధిస్తూ కోర్టులు తీర్పు చెప్పాయి. ఈ నెలలో 7 రోజుల్లో 55 మందికి రూ.55 వేల జరిమానా విధించడం గమనార్హం. ఐదుగురికి ఒకరోజు చొప్పున జైలు శిక్షతో పడింది. గురువారం అర్ధరాత్రి తర్వాత భిక్కనూరు బైపాస్‌లో పోలీసుల తనిఖీల్లో భాగంగా 27 మందిపై డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు చేయడంతో పాటు ఒక బస్సును సీజ్ చేశారు.

### నిజామాబాద్ జిల్లాలో..

నిజామాబాద్‌లో జిల్లాలో 2025 జూలైలో 424 మందిపై డ్రంకన్ డ్రైవ్ కేసులు బుక్ చేశారు. అందులో 393 మందికి రూ.5,61,600 ఫైన్లు వేశారు. అలాగే 17 మందికి జైలు శిక్షపడింది. ఆగస్ట్‌లో 506 కేసులు నమోదు చేసి 458 మందికి రూ.7,07,659 ఫైన్లు వేశారు. 28మందికి జైలు శిక్ష వేశారు. సెప్టెంబర్‌లో 246 కేసులు నమోదు చేయగా.. 221మందికి రూ. 3,25,997 ఫైన్ వేశారు. 11మందికి జైలుశిక్ష పడింది. అలాగే అక్టోబర్‌లో 347మందిపై కేసులు నమోదు కాగా 291మందికి రూ.4,43,500 ఫైన్లు వేశారు. అలాగే 18మందికి న్యాయస్థానం జైలుశిక్ష విధించింది. కొన్నికేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

### డ్రంకన్ డ్రైవ్ చేస్తే కఠిన చర్యలు



మద్యం సేవించి వాహనం నడపడం చట్టరీత్య నేరం మాత్రమే కాదు అది ప్రాణాలతో చేసే ప్రమాదకర ఆట. డ్రంకన్ డ్రైవ్ చేసే ప్రతి ఒక్కరిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజల భద్రతే మాకు ముఖ్యం. ప్రతిరోజు నిరంతరం డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు కొనసాగుతాయి. వాహనదారులు ఖచ్చితంగా ట్రాఫిక్ నియమాలు పాటించి పోలీసులకు సహకరించాలి. **– రాజేష్ చంద్ర, కామారెడ్డి ఎస్పీ**

## అదనపు వసూళ్ల ఎఫెక్ట్ కానిస్టేబుల్ సస్పెన్షన్

**అక్షరటుడే, కామారెడ్డి :** బాధితుల నుంచి అదనపు వసూళ్లకు పాల్పడుతున్న కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు కామారెడ్డి ఎస్పీ రాజేష్ చంద్ర శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బాన్సువాడ పరిధిలో పేకాట కేసులో 9 మందిని అరెస్ట్ చేసి ఈనెల 6న కోర్టులో హాజరుపరిచారు. కోర్టు వారికి జరిమానా విధించగా కోర్టులో పనిచేస్తున్న కానిస్టేబుల్ బుక్యా శ్రీను జరిమానా కాకుండా అదనంగా వసూలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో శాఖాపరంగా అంతర్గతంగా విచారణ చేపట్టారు. విచారణలో అదనపు డబ్బులు వసూలు చేసినట్టు తేలడంతో కానిస్టేబుల్ శ్రీనును సస్పెండ్ చేస్తూ ఎస్పీ రాజేష్ చంద్ర ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ సిబ్బంది అనైతిక చర్యలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## రేపు నగర పథ సంచలన్

**అక్షరటుడే, ఇందూరు :** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఇందూరు నగర పథ సంచలన్ ఆదివారం నిర్వహిస్తున్నట్లు నగర కార్యవాహ అరుగుల సత్యం తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. నగరంలోని చంద్రశేఖర్ కాలనీ హెచ్‌పీఎస్ పాఠశాల నుంచి సాయంత్రం 4.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఇప్పటికే ఉపనగర సంచలన్ నిర్వహించినట్లు తెలిపారు. మహా పథ సంచలన్ కు నగరంలోని సంఘ్ సభ్యులు పూర్తి గణవేష్‌తో హాజరుకావాలని ఆయన సూచించారు.



## ప్రాజెక్ట్‌లకు కొనసాగుతున్న వరద

**అక్షరటుడే, మెండోరా/ఎల్లారెడ్డి :** శ్రీరాంసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లకు వరద కొనసాగుతోంది. దీంతో అధికారులు గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ఎగువ మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో శ్రీరాంసాగర్ జలశయానికి వరద పోటెత్తుతోంది. దీంతో అధికారులు శనివారం 8 వరద గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయంలోకి ప్రస్తుతం 34,454 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో అంతే మొత్తంలో దిగువకు నీటిని వదులుతున్నారు. ఎస్కేప్ గేట్ల ద్వారా 8 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ కు 650 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఆవిరి రూపంలో 573 క్యూసెక్కులు పోతోంది. కాకతీయ, లక్ష్మీ కాలువలకు ప్రస్తుతం నీటి విడుదలను నిలిపేశారు. జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం అంతేస్థాయిలో నీరు నిల్వ ఉంది.

### నిజాంసాగర్‌కు..

నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి ఇన్‌ఫ్లో పెరిగింది. జలాశయంలోకి ప్రస్తుతం 9,570 క్యూసెక్కుల వరద వస్తుండగా.. అధికారులు రెండు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టంతో నిండుకుండలా ఉంది.

## రాజకీయ, నామినేటెడ్ పదవుల్లో వడ్డెరలకు ప్రాధాన్యత




**అక్షరటుడే, బాన్సువాడ:** రాజకీయ, నామినేటెడ్ పదవుల్లో వడ్డెరలకు ప్రాధాన్యతనిస్తామని, హైదరాబాద్ నగర అభివృద్ధిలో వడ్డెరల పాత్ర ప్రముఖమైందని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, అజారుద్దీన్ పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని బోరబండ జయశంకర్ కమ్యూనిటీ హాల్‌లో జాతీయ వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు, బాన్సువాడకు చెందిన పిట్ల శ్రీధర్ అధ్యక్షతన వడ్డెరల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మంత్రులు పొంగులేటి, సీతక్క, అజారుద్దీన్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో వడ్డెర కులస్థుల కోసం ఐదెకరాల భూమిని కేటాయిస్తామన్నారు. పీజేఆర్ హయాంలో వడ్డెరలకు ఇళ్ల పట్టాలు ఇవ్వగా బీఆర్ఎస్ ప్రభుత్వం వాటిని రద్దు చేసిందన్నారు. కానీ వాటిని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తిరిగి అందజేస్తామని హామీనిచ్చారు. కాంగ్రెస్ పేదల పార్టీ అని.. అందుకే 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, వడ్డీ లేని రుణాలు, ప్రమాద బీమా వంటి పథకాలు అందిస్తున్నామన్నారు. వడ్డెరులకు లేబర్ కార్డులు, ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తామని మంత్రులు తెలిపారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు గుంజ రేణుక, వల్లెపు శివకుమార్, వల్లెపు నరసింహారావు, వేముల యాదయ్య, పల్లపు సమ్మయ్య, బత్తుల లక్ష్మీ కాంతయ్య, వేముల భరత్, బోదాసు రవి, వేముల సత్యం, పల్లపు రమేష్, జెరిపటి రాజు, వల్లెపు గిరీష్, గుంజ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్ట్: ఎస్పీ రాజేష్ చంద్ర




**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాలో పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రాజేష్ చంద్ర వివరాలు వెల్లడించారు. గతనెల 31న చిన్నమల్లారెడ్డి గ్రామ శివారులో పాత జాతీయ రహదారి పక్కన ఉన్న ఆటో ఎలక్ట్రికల్ రేకుల షెడ్డులోకి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి షెడ్డులో ఉన్న కారు, ఇతర వస్తువులు చోరీ చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. అలాగే ఇటీవల కామారెడ్డి పట్టణ పరిధిలో జరిగిన చోరీలపై నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సీసీ కెమెరాల ద్వారా వివరాలు సేకరించారు. అయితే శనివారం నర్సన్నపల్లి కమాన్ వద్ద మరోసారి చోరీకి ప్లాన్ చేసి అనుమానాస్పదంగా తిరుగుతున్న వారిని పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. వీరిని విచారించగా దేవునిపల్లి, కామారెడ్డి, సదాశివనగర్, భిక్కనూరు పరిధిలో 15 చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు.

అలాగే నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లో చోరీలకు పాల్పడినట్టు తేలింది. నిర్మల్, మహబూబాబాద్‌కు చెందిన 8 మంది ముఠాగా ఏర్పడి ఈ చోరీలకు పాల్పడుతున్నారని ఎస్పీ వివరించారు. వివిధ జిల్లాల్లో సుమారుగా కిలోన్నర బంగారం, ఇతర ఆభరణాలు చోరీ చేసినట్టు ఆయన తెలిపారు. నిర్మల్ జిల్లా బాంని గ్రామానికి చెందిన షేక్ ట్రాఫిక్, షేక్ ఖాదర్, షేక్ ఖయ్యూమ్, షేక్ అజ్జు, మహబూబాబాద్ పట్టణానికి చెందిన బండారి అశోక్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్టు తెలిపారు. అనంతరం వీరిని కస్టడీకి తీసుకుని విచారించి చోరీ చేసిన సొత్తును రాబడతామన్నారు. ఇందులో అశోక్ పై 22 కేసులు, షేక్ అజ్జుపై 9, ఖాదర్‌పై 17, ఖయ్యుమ్ పై 18, రఫీక్‌పై ఒక కేసు ఉన్నట్టు తెలిపారు. వీరి వద్ద నుంచి ఒక కారు మూడు బైకులు, మూడు ఇనుప రాడ్లు, ఒక సుత్తి, స్క్రూ డ్రైవర్ టైప్ వెపన్, డీజిల్ క్యాన్, ఒక వెహికిల్ డయాగ్నస్టిక్ స్కానర్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసు దర్యాప్తులో చురుగ్గా పాల్గొన్న పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ చైతన్య రెడ్డి, సీసీఎస్, కామారెడ్డి రూరల్ సీఐలు శ్రీనివాస్, రామన్, దేవునిపల్లి ఎస్సై రంజిత్, సీసీఎస్ ఎస్సై ఉస్మాన్ పాల్గొన్నారు.

## ఘనంగా సయ్యద్ చుమన్‌షావలి దర్గా ఉత్సవాలు



**అక్షరటుడే, గాంధారి:** మండల కేంద్రంలో శనివారం సయ్యద్ చుమన్ షావలి దర్గా ఉత్సవాలను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇందులో భాగంగా పాత మసీద్ నుంచి దర్గా వరకు ముస్లింలు గుర్రంపై సందల్ ను ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మాజీ కో–ఆప్షన్ సభ్యుడు ముస్తఫా మాట్లాడుతూ ప్రతిఏటా ఉర్సును భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తామని వివరించారు. అంతేకాకుండా దర్గా పరిసర ప్రాంతాలను శుభ్రపర్చి రంగులు వేసి విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించామని తెలిపారు. గుర్రంతో పాత మసీదు నుంచి బయలుదేరి దర్గాకు చేరుకునే తరుణంలో ప్రధాన వీధుల గుండా గుర్రంతో ఆటలాడిస్తూ దర్గాకు చేరుకుంటామన్నారు. అనంతరం సాయంత్రం దర్గా వద్దే భోజన కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో గ్రామస్థులు, పెద్దలు రాజకీయ నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## అభయాంజనేయ ఆలయానికి విరాళం




**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని అభయాంజనేయ ఆలయానికి విహాన్ సొసైటీ ఆధ్వర్యంలో విరాళం అందజేశారు. ఈ మేరకు గురువారం ఆలయ కమిటీ సభ్యులకు సొసైటీ తరపున రూ.25,000 విరాళమిచ్చారు. ఈ సందర్భంగా సొసైటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. విహాన్ సొసైటీ నిధుల నుంచి కాకుండా స్వచ్ఛందంగా వసూలు చేసి ఆలయాభివృద్ధికి నిధులు అంజేసినట్లు వారు వెల్లడించారు. ఆలయ అభివృద్ధిలో పాలు పంచుకున్నందుకు తమకు ఆనందంగా ఉందని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.



## గ్రామాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**అక్షరటుడే, ఆర్మూర్:** కాంగ్రెస్ హయాంలో గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ఆలూర్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కెర విజయ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి వినయ్ రెడ్డి ఆదేశాల మేరకు ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.40 లక్షలతో డ్రెయినేజీ పనులు, సీసీ రోడ్డు పనులను శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రతి గ్రామంలో మౌలిక వసతులను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఆలూర్ గ్రామంలో దశలవారీగా రహదారులు, డ్రెయినేజీ వ్యవస్థతో పాటు ప్రజావసరాల పనులను చేపడుతామని ఆయన పేర్కొన్నారు.

**ఆర్మూర్ మండలంలోని మగ్గిడి గ్రామానికి చెందిన ఆదర్శ రైతు నలిమెల చిన్నారెడ్డి ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంభిస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు.**

– అక్షరటుడే, ఆర్మూర్



# ఆదర్శ రైతు.. దూరదృష్టి

▸ కాలుష్యాన్ని తగ్గించేందుకు వినూత్న ప్రయోగం

రైతులు తమ పొలాలు కోతలయ్యాక కొయ్యలను నిప్పుపెట్టడంతో పర్యావరణానికి హాని కలిగిస్తుండగా. రైతు చిన్నారెడ్డి మాత్రం వినూత్న పద్ధతిలో ముందుకెళ్తున్నారు. చాలా ప్రాంతాల్లో పొలం కోసిన తర్వాత రైతులు కొయ్యలను తగలబెట్టేస్తున్నారు. దీంతో పర్యావరణానికి హాని జరుగుతోంది. అలాగే పొలాలకు దగ్గరగా ఉన్న రోడ్లపై వెళ్తున్న వారు పొగ కారణంగా ఇబ్బందులు పడుతుంటారు.



రైతు నలిమెల చిన్నారెడ్డి

### భూమికి సైతం సారం..

రైతు నలిమెల చిన్నారెడ్డి తన వ్యవసాయ క్షేత్రంలో పంట వ్యర్థాలను తగలపెట్టకుండా పొలంకోసిన తర్వాత కొద్దిగా నీరుపెట్టి 50 కేజీల సింగిల్ సూపర్ ఫాస్పేట్ చల్లాడు. అనంతరం ట్రాక్టర్ కేజీవీల్స్ లో దమ్ముచేస్తే ఆ పంట వ్యర్థాలు భూమిలో కలిసిపోయాయి. ఒక నెల రోజులు ఆరబెట్టిన తర్వాత తిరిగి కల్టివేటర్ చిన్ననాగళ్లతో దున్నుకొని రెండో పంటకు రెడీ చేసుకోవచ్చు. దీంతో భూమిలో సారం సైతం పెరుగుతుందని పంట వేయడం ఆలస్యమైనా ఎలాంటి ఇబ్బంది లేదని.. మరోపంట వేసేంతవరకు అది కుళ్లిపోయి పంటల ఎదుగుదల, దిగుబడికి దోహదపడుతుందని రైతు చిన్నారెడ్డి తెలిపారు.

### ప్రయోజనాలివే..

1) భూమికి పరిపూర్ణమైన సారం అందుతుంది.
2) వాతావరణ కాలుష్యాన్ని పూర్తిగా తగ్గించవచ్చు.
3) కొయ్యలను తగలబెట్టినప్పుడు వేడికి భూమిలో ఉన్న సారం పోతుంది. దానిని ఈ ప్రయత్నం ద్వారా తగ్గించవచ్చు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం




**అక్షరటుడే, ఆర్మూర్:** క్రీడలతో శరీరదారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని పిప్రి గురుకుల పాఠశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న క్రీడలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా శనివారం ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. బాసర జోన్ పరిధిలోని నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్, జగిత్యాల పాటు రాజన్న సిరిసిల్ల జోన్‌లోని కామారెడ్డి జిల్లాలోని మొత్తం 12 గురుకుల పాఠశాల, కళాశాలలకు చెందిన 1,020 మంది క్రీడాకారులు అండర్ 17,19 విభాగాల ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, అథ్లెటిక్స్ విభాగాల్లో తలపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా గురుకుల పాఠశాలల సమన్వయధికారి మాధవి లత, అధ్యాపకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## మానవత్వం చూపిన ట్రాఫిక్ కానిస్టేబుల్..

**అక్షరటుడే, నిజామాబాద్‌సిటీ:** విధుల్లో ఉన్న ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ మానవత్వం చూపారు. ఫిట్స్ వచ్చి రోడ్డుపై పడిఉన్న వ్యక్తికి ప్రథమచికిత్స అందించి ఆస్పత్రికి తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. నగరంలోని అర్సపల్లి పీహెచ్‌సీ సమీపంలో సాయి అనే వ్యక్తి ఫిట్స్ వచ్చి పడిపోగా.. రైల్వే గేట్ వద్ద విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ పవన్‌కుమార్ కు సమాచారం అందగా వెంటనే ఆయన స్పందించారు. రోడ్డుపై పడిఉన్న సాయికి ప్రథమ చికిత్స చేశారు. బాధితుడి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. అంతలోపే అతడిని 108లో ఆస్పత్రికి తరలించారు.

## లక్కీడ్రాలను నమ్మి మోసపోవద్దు: భీమ్‌గల్ సీఐ




**అక్షరటుడే, భీమ్‌గల్ :** ప్రజలు లక్కీ డ్రాలను, స్కీమ్‌లను నమ్మి మోసపోవద్దని భీమ్‌గల్ సీఐ సత్యనారాయణ సూచించారు. పట్టణంలోని ఠాణాలో ఎస్సై సందీప్ తో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భీమ్‌గల్ సర్కిల్ పరిధిలోని కమ్మర్‌పల్లి, మోర్తాడ్ తదితర మండలాల్లో వ్యవసాయ భూములు, నివాస స్థలాలు లక్కీ డ్రా ద్వారా అతి తక్కువ ధరలకు విక్రయిస్తామని చెప్పి మోసాలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.అలాంటి వారిని ప్రజలు నమ్మి మోసపోవద్దన్నారు. రాష్ట్రప్రభుత్వ చట్టాల ప్రకారం లక్కీ డ్రాలు స్కీములు నిర్వహించడం నేరమన్నారు. ఎవరైనా మోసాలకు పాల్పడితే.. చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్కీంలు డ్రాల పేరుతో ఎవరైనా మీ ముందుకు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

## 'చలో ఢిల్లీ'కి ఎమ్మార్పీఎస్ నాయకులు తరలిరావాలి



**అక్షరటుడే,కోటగిరి:** 'చలో ఢిల్లీ'కి ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు పోచిరాం పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పోచిరాం మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయిపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన పట్ల చట్టపరమైన వ్యవస్థలు చూపుతున్న నిర్లక్ష్యం, వివక్షతను నిరసిస్తూ ఈనెల 17న న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద దళితుల ఆత్మగౌరవ ప్రదర్శన చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీకాంత్, కన్నం శ్రీనివాస్, డప్పు లాలయ్య, శ్రీకాంత్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## తరుగు పేరుతో రైస్‌మిల్లర్ల దోపిడీని అరికట్టాలి




**అక్షరటుడే, ఆర్మూర్:** వరిధాన్యం కొనుగోళ్లలో తరుగు పేరుతో రైస్ మిలర్ల దోపిడీని అరికట్టాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.ప్రభాకర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు పలు దఫాలుగా పడి రైతాంగాన్ని తీవ్రంగా నష్టపర్చాయన్నారు. ప్రభుత్వం ఎకరాకు రూ.10,000 నష్టపరిహారం ఇస్తామని చేతులు దులుపుకుందని.. ఇప్పటికీ నయాపైసా ఇవ్వలేదన్నారు. మరోవైపు రైస్‌మిల్లర్లు అనేక రకాలుగా దోపిడీ చేస్తూ రైతులను ముంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిల్లర్లు తరుగు పేరుతో క్వింటాల్‌కు 3 కేజీల నుంచి 4 కేజీల వరి ధాన్యాన్ని అక్రమంగా తీసుకుంటూ రైతులను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. డీఎస్‌వో లాంటి అధికారులు సైతం రైస్ మిల్లర్లకు వత్తాసు పలుకుతూ మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ఈ సమావేశంలో అఖిలభారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బి. దేవారాం, జిల్లా అధ్యక్షుడు సురేష్, ప్రధానకార్యదర్శి బాబన్న, జిల్లా ఉపాధ్యక్షుడు రాజన్న, కార్యదర్శి దామోదర్, కిషన్, కోశాధికారి లింబాద్రి, నాయకులు రమేష్, పోశన్న, లింబాద్రి, కిషోర్, సాయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చేపల వేటకు వెళ్లిన యువకుడు గల్లంతు

**అక్షరటుడే, బీర్కూర్ :** చేపల వేటకు వెళ్లిన ఓ యవకుడు గల్లంతయ్యాడు. బీర్కూర్ మండలంలో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బీర్కూర్ మండలం దామరంచ గ్రామానికి చెందిన నర్సింలు స్థానికంగా ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ వద్ద చేపలు పట్టేందుకు వెళ్లాడు. అయితే చేపలు పట్టే క్రమంలో మంజీర నది లో గల్లంతయ్యాడు. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఉదయం నుంచి పోలీసుల ఆధ్వర్యంలో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నప్పటికీ యువకుడి ఆచూకీ లభించలేదు.



నిజామాబాద్ నగరంలో..



ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..



ఆలూర్ మండల కేంద్రంలో..

# ఘనంగా సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుక

సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఉమ్మడిజిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందేవిధంగా సీఎం కృషి చేస్తున్నారని చెప్పారు. – అక్షరటుడే, నెట్‌వర్క్



గాంధారిలో..



కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో ..



వర్ని మండల కేంద్రంలో..



నందిపేట్‌లో..




ఆర్మూర్ మండల కేంద్రంలో..